క్లుప్తంగా

ధ్యానంతో ప్రశాంతత



మాట్లాడుతున్న బండ శ్రీనివాస్

హుజూరాబాద్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రాధాస్వామి సత్సంగంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. నిత్యం ధ్యాన సాధనతో రోగాలు దరిచేరవని, ఒత్తిడి తగ్గడంతోపాటు మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలని, మనల్ని మనం తెలుసుకోవడమే ధ్యానమని తెలిపారు. అనంతరం ధ్యాన గురువు అనిల్‌ను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ధ్యాన గురువు అనిల్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఫౌండేషన్ నిర్వాహకులు, తదితరులు

జమ్మికుంట: పట్టణంలో సదాశయ ఫౌండేషన్, యోగా సెంటర్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంతో మరొకరి జీవితాల్లో వెలుగు నింపినవారు అవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు మచ్చగిరి నరహరి, యోగా సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లావణ్య

శంకరపట్నం: మండలంలోని ఆర్ఎంపీలకు మెడికవర్ నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. లక్ష మందిలో నాలుగు వేలమంది గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని, సీపీఆర్‌పై అవగాహన లేకపోవడంతో కళ్లముందే గుండె సమస్యలతో బాధపడుతున్న వారిని కాపాడలేకపోతున్నామని, శిక్షణ పొంది పలువురిని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సమ్మిరెడ్డి, జయరాం, సమ్మయ్య, ఆస్పత్రి హెడ్‌కిరణ్, మేనేజర్ కరుణాకర్, శ్రీకాంత్, సంజీవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విహారయాత్ర



విహారయాత్రలో కుటుంబ సభ్యులు

హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని బాల మిత్ర గణపతి భక్తజన బృందం, మండప నిర్వాహకులు, కాలనీవాసులు, పిల్లలు పెద్దలు అంతా కలిసి స్థానిక రంగనాయకుల గుట్ట వద్ద వనభోజనం, విహారయాత్రను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సామూహిక భోజనాలు చేసి స్వీట్లు పంచుకున్నారు. పిల్లలు, పెద్దలు మ్యూజికల్ చైర్స్, మహిళల కోలాటం, డ్యాన్సులతో సందడి చేశారు.

రక్తదానం

హుజూరాబాద్: ఆపదలో ఉన్నవారి ప్రాణం కాపాడేందుకు ఓ యువకుడు ముందుకు వచ్చాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన యువతి బండారి దివ్య డెంగీ బారిన పడటంతో రక్తకణాలు తగ్గిపోయాయి. ఆమెకు ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని డాక్టర్లు సూచించడంతో దివ్య బంధువులు రక్తదాత కోసం సబ్బని వెంకట్ ఏర్పాటు చేసిన ఓ బ్లడ్ గ్రూపులో వివరాలు పోస్ట్ చేశారు. హుజూరాబాద్‌కు చెందిన ఉమ్మడి రాము స్పందించి కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. రాముతో పాటు బ్లడ్ గ్రూప్ ఏర్పాటు చేసిన సబ్బని వెంకట్‌కు దివ్య కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

పీఈటీలకు సన్మానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని పలువురు పీఈటీలు, కోచ్‌లు, పీఈటీ సంఘాల ప్రతినిధులను ఆదివారం పలు సంస్థల ఆధ్వర్యంలో సన్మానించారు. హన్మకొండలోని శ్రీహర్ష ఏసీ కళాశాల హాల్‌లో తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రైవేటు పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రెడ్డిని సన్మానించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అచీవర్స్ స్కూల్ పీఈటీ కూరపాటి లక్ష్మీనారాయణను సన్మానించారు. ఎస్సారార్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, జీఎస్పీ అధ్యక్షుడు మల్లేశం శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. వీరిని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డిలతో పాటు పలు క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు అభినందించారు.

నీరసం.. ఒళ్లు నొప్పులు

- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు
- పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు



హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

హుజూరాబాద్ : పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఓ వ్యక్తి గొంతునొప్పి, జ్వరంతో బాధపడుతూ మందుబిళ్లు వేసుకున్నారు. ఫలితం కనిపించలేదు. విపరీతమైన ఒళ్లు నొప్పులతో శరీరమంతా వేడెక్కింది. భరించలేని పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్తే వైద్యులు వివిధ పరీక్షలు చేసి వైరల్ జ్వరమని తేల్చారు. వారం రోజుల పాటు మందులు వాడగా జ్వరం తగ్గింది కానీ ఒళ్లు నొప్పులు తగ్గకపోవడం కారణంగా నీరసంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇలా అనేక మంది ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణంలోని మార్పులతో పాటు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు త్వరగా వ్యాధుల బారిన పడుతున్నారు. కొందరు జలుబుతో జ్వరం బారినపడుతున్నారు. జ్వరం, గొంతు, ఒళ్లు నొప్పులతోపాటు మరికొందరికి శరీరంపై దురద లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలామందికి వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తే నెగెటివ్ వస్తున్నా అలాంటి లక్షణాలే ఉంటున్నాయి. దీంతో వైద్యులు లక్షణాలకు అనుగుణంగా యాంటీబయోటిక్స్, జ్వరం మాత్రలు ఇస్తున్నారు. తగ్గకపోతే స్టెరాయిడ్స్ అందజేస్తున్నామని చెబుతున్నారు. గ్రామాల్లోని ప్రజలు రోగుల బారిన పడుతుండటంతో హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుప్రతులను ఆశ్రయిస్తున్నారు. ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్నామని రోగులు వైద్యులు ఎదుట వాపోతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు పరీక్షలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తుండగా వారి జేబులకు చిల్లు పడుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు పల్లెల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీలతో పాటు పల్లెల్లో వీధులు మురికి కూపాలను తలపిస్తున్నాయి. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా దోమల నివారణ చర్యలను గాలికొదిలేస్తున్నారు. పట్టణాల్లో అరకొర నిధులతో పాటు పర్యవేక్షణ లోపం కారణంగా పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది.

అవసరమైతేనే మందులు వాడాలి



జ్వరం వచ్చినప్పుడు యాంటీబయోటిక్స్ వాడడం వల్ల ఒళ్లు నొప్పులు తగ్గవు. వీటి వినియోగంతో అనర్థాలే అధికం. బీ కాంప్లెక్స్ తీసుకుంటే అలసట ఉండదు, నొప్పులు తగ్గుతాయి. ఇబ్బందులు అధికంగా ఉంటే వైద్యులను సంప్రదించి ఔషధాలు వాడాలి.

– నారాయణరెడ్డి, హుజూరాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్,

వరదకాలువ సమస్య పరిష్కరించాలి



వరదకాలువను పరిశీలిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో వరదకాలువ సమస్య పరిష్కరించాలని బీజేపీ నాయకుడు కొలకాని రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధి ఎనిమిదో వార్డులో నాయకులతో కలిసి వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, బచ్చు శివన్న, విజేందర్, మహేందర్, జగన్, శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల సంబురాలు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ఆర్నకొండలో నాయకుల సంబరాలు

జీఎస్టీ భారం తగ్గించిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. సామాన్య, పేద ప్రజలకు ఉపయోగపడే నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గొల్ల గట్టయ్య, సింగిరెడ్డి భూంరెడ్డి, మొగిలి సారయ్య, బైరగోని కిట్టుగౌడ్, రామగిరి శ్రీనివాస్, దామెర మధుసూదన్‌రెడ్డి, గంటల రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

చొప్పదండి: మండలంలోని శ్రీవేంటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు చొప్పదండికి చెందిన భక్తుడు రూ.నలభై వేల విరాళం అందించాడు. పట్టణానికి చెందిన కళ్యాణపు చంద్రశేఖర్ అగ్నిమాపకశాఖలో ఉద్యోగం సాధించాడు. మూడేళ్ల క్రితం గుమ్లాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించాడు. తల్లిదండ్రులు రాములు, జమునతో కలిసి ఆదివారం ఆలయ నిర్వాహకులకు నగదు అందజేసి మొక్కు చెల్లించుకున్నాడు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, అర్చకులు బైరి కృష్ణమూర్తి, దుంపల ఐలేందర్, రాజమౌళి, బీసవేని రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో చంద్రశేఖర్

ఆలయం మూసివేత

శంకరపట్నం: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయాన్ని ఆదివారం అర్చకులు, ఉద్యోగులు మూసివేశారు. చంద్రగ్రహణం వీడాక సోమవారం ఆలయ శుద్ధి, ప్రాతకాల పూజ అనంతరం పది గంటలకు దర్శనానికి భక్తులకు అనుమతివ్వనున్నామని అర్చకుడు శేషం మురళీధారాచార్యులు తెలిపారు.

నియామకం

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీని గ్రామస్తులు ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగంపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శిగా ఇనుకొండ తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం

మానకొండూర్: మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఆరోగ్యమిత్ర గాలిపెల్లి ఆంజనేయులు ఇటీవల ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు, ఫీల్డ్‌స్టాఫ్ డీసీ, డీఎం, టీమ్ లీడర్లు, ఆరోగ్య మిత్రాలు ఆదివారం పరామర్శించారు. అనంతరం రూ.1.10 లక్షలు అందజేశారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జనరల్ మేనేజర్ డా. బి.నరేశ్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్స్, జిల్లా మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు

వరకట్న వేధింపు కేసు

జమ్మికుంట: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడిన ఏడుగురిపై ఆదివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండంలోని విలాసాగర్‌కు చెందిన మౌనికకు మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన మిడిదొడ్డి శివాజీతో 2021లో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్న కానుకలు అందజేశారు. ఏడాదిగా భర్త, అత్తమామ, బావ, తోడికోడలు, ఆడపడుచు , ఆమె భర్త అదనంగా రూ.పదిలక్షలు తీసుకురావాలని ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

యువతి అదృశ్యం..

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యం కాగా ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పూదరి స్వర్ణలత(20) ఆగస్టు 22న ఇంటినుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.



స్వర్ణలత

సేవలతోనే గుర్తింపు

కరీంనగర్ అర్బన్: సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం టీఎన్జీవోల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ చిక్కుడు రాజయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 40 ఏళ్ల ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేయడం అభినందనీయమని కొనియాడారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, డీటీవో నాగరాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, అంజయ్య, అరవింద్ రెడ్డి, రామ్మోహన్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామస్వామి, పట్టణ అధ్యక్షుడు రాజేశ్‌భరద్వాజ్, నాయకులు పాల్గొన్నారు.

పాడె మోసిన చొప్పదండి ఎమ్మెల్యే సత్యం



మాధవరెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: మండలంలోని వెదురుగట్ట గ్రామంలో పాముకాటుతో మృతి చెందిన బాలిక దీప్తి కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. పట్టణానికి చెందిన మైనారిటీ నాయకుడు చాంద్ పాషా తల్లి మరణించగా పరామర్శించారు. చాకుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంకిడి మాధవరెడ్డి గుండెపోటుతో మృతి చెందగా అంతిమయాత్రలో పాల్గొన్నారు. భూపాలపట్నంకు చెందిన మాజీ సర్పంచ్ తోడేటి డేవిడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎమ్మెల్యే పరామర్శించారు. వెంట నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి: మండలంలోని చాకుంట మాజీ సర్పంచ్ గంకిడి మాధవరెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, సదాశివ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, పెద్దెల్లి అనిల్, తదితరులు పాల్గొన్నారు.



మానకొండూరు: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలోని పటేల్‌కుంట ఇటీవల కురిసిన వర్షాలకు నిండింది. కుంటలో నిర్మించిన శ్మశానవాటిక నీట మునగడంతో దహన సంస్కారాలు నిర్వహించడానికి మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అశోక్, పంచాయతీ కార్యదర్శి, సెల్ నంబర్ : 9000882009

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



జ్ఞాన సరస్వతి ఆలయంలో పల్లకి సేవ

చొప్పదండి: పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆదివారం భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమపూజ చేశారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేపట్టారు. చంద్ర గ్రహణం పురస్కరించుకొని ఆలయం మూసివేశారు. కార్యక్రమంలో పట్టణంలోని భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి నిర్మలారాణికి 'ఉదారి నాగదాసు' స్మారక పురస్కారం

కరీంనగర్ కల్చరల్: జిల్లాకు చెందిన రచయిత్రి తోల నిర్మలారాణి ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో తత్వకవి ఉదారి నాగదాసు స్మారక పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెరవే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, పురస్కార ప్రదాత ఉదారి నారాయణ, ఉదారి నాగదాసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలారాణికి పలువురు , రచయితలు అభినందనలు తెలిపారు.

వరదొస్తే రాకపోకలు బంద్

- లోలెవల్ వంతెనల వద్ద వానాకాలంలో తప్పని తిప్పలు
- ఆందోళనలో ప్రయాణికులు, వాహనదారులు
- హైలెవల్ బ్రిడ్జీలు నిర్మించాలని వినతి



కరీంనగర్ - జమ్మికుంట రోడ్డు మధ్యలోని లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద(ఫైల్)

మానకొండూర్: వర్షాలతో లోలెవల్ వంతెనలపై వరదనీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వంతెనల వద్ద వరద ఉధృతంగా ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏళ్లుగా పాలకులు, సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పెను ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మండలంలోని కరీంనగర్ జమ్మికుంట రోడ్డు మధ్యలో చాలా చోట్ల లోలెవల్ వంతెనలు ఉన్నాయి. అన్నారం గ్రామం వద్ద రెండు, మానకొండూర్ మహంకాళినగర్ వద్ద, గంగిపల్లిలో ఇసుకవాగు, ఇదే గ్రామంలోని మరోచోట ఎరడపల్లి – కొండపల్కలకు వెళ్లే దారిలో, ఈదులగట్టెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట, వెల్ది, లింగాపూర్ శివారులోని లోలెవల్ వంతనల వద్ద భారీ వర్షాలతో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ దారి గుండా వందలాది వాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. వరదల సమయంలో వాహనదారులు అటువైపుగా వెళ్తే వరదలో కొట్టుకు పోవాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. ఏటా పాలకులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడమే తప్ప ఇప్పటి వరకు ఎక్కడ చర్యలు చేపట్టలేదని వాహనదారులు, ప్రయాణికులు మండిపడుతున్నారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న కాజ్‌వేల వద్ద హైలెవల్ బ్రిడ్జీలు నిర్మించాలని కోరుతున్నారు.

అటకెక్కిన సాగు సర్వే

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్ పంటల సర్వే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఇంకా చేపట్టలేదు. ప్రతీ సీజన్‌లో రైతులు ఎంత మంది ఉన్నారు, సాగు భూమి ఎన్ని ఎకరాల్లో ఉంది, ఏఏ పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను ఏఈవోలు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తారు. సర్వేనంబర్ల వారీగా పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో నమోదు చేస్తారు. పంటలు సాగు చేసి నెలలు గడుస్తుండగా సర్వే చేయాల్సిన ఏఈవోలు యూరియా పంపిణీ విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రతీ వానాకాలంలో ఆగస్టు మొదటి వారంలోనే ఏఈవోలు పంటల సర్వే చేపట్టి నెలరోజుల్లో పూర్తి చేస్తారు. ప్రభుత్వం ఇప్పటి వరకు పంటల సర్వేకు ఆదేశాలు జారీ చేయకపోవడంతో ఏఈవోలు రైతు బీమా, సబ్సిడీపై యంత్ర పరికరాలకు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పది రోజుల నుంచి సహకార సంఘాలు, డీసీఎంఎస్, ఆగ్రోస్ కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ విధులను నిర్వహిస్తున్నారు. వానాకాలంలో కరీంనగర్ మండలంలో 15,978 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా వరి 12,623 ఎకరాలు, పత్తి 2,300,మొక్కజొన్న 250 ఎకరాల్లో సాగవుతోంది. ప్రభుత్వం పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేటప్పుడు ఖచ్చితమైన పంట విస్తీర్ణం లెక్కల కోసం ప్రతీ సీజన్‌లో పంటల సర్వే నిర్వహిస్తోంది. ఆన్‌లైన్‌లో పంటల పూర్తి వివరాలను నమోదు చేయడంతో కొనుగోళ్ల సందర్భంగా సమస్యలు తలెత్తకుండా ఉంటుంది. ఇప్పటివరకు వ్యవసాయశాఖ సర్వే ప్రారంభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చే దశలో ఉంది. కాగా ఇటీవలనే ప్రభుత్వం పంటల సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏఈవోలకు యూరియా పంపిణీ బాధ్యతలను అప్పగించడంతో ప్రారంభించ లేదని వ్యవసాయాధికారులు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో సర్వే ప్రారంభించే అవకాశముందని పేర్కొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధనకు దరఖాస్తులు ఆహ్వానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.మాలతి తెలిపారు. పీజీ ఉత్తీర్ణత శాతం, నెట్/సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.